# వేచిచూడు

**- సాదా**

**పరిస్థితుల ప్రాబల్యం వల్ల అతడు అజ్ఞాతవాసంలో వున్నాడు. మొదటిసారిగా మొన్ననే రహస్యంగా ఇంటికి వచ్చి వెళ్ళాడు. ఆయన రాకకు కారణం లేకపోలేదు.**

**భా**ర్య నడవడిక గురించి ఆయనకు అయిన వారూ బంధు మిత్రులూ పడుతున్న ఆందోళన ఎట్లాగైతేనేమి తెలిసింది. తెలియడం సరే దానికి తానేం చేయగలడు? యేం జరగాలని వారు ఆశిస్తున్నారు?

భార్యనూ కూతురినీ వారి మానాన వారిని వొదిలి అర్ధరాత్రి తాను అడవుల పాలుగావలసి వొచ్చింది. ఆనాటి నుంచి వొకరికొకరు జాడ జవాబు లేని జీవితం గడుపుతున్నారు. ఈ పరిస్థితులలోని కష్టనిష్టూరాలూ మంచి సెబ్బరలూ న్యాయాన్యాయాలూ ఇద్దరికీ సమానంగా వర్తిస్తాయి.

అతడి నిబద్ధత విప్లవం లేవదీయడానికి సంబంధించినది. దానికీ బహిరంగ కుటుంబ జీవనానికీ ఇక ఎన్నటికీ పొత్తు పొసగదు.

ఆమె పట్టుదల తన కూతురిని సొంత కాళ్ళపై నిలబడేట్టు పెంచడానికి సంబంధించినది. దీనికీ అజ్ఞాతవాసానికీ పొంతన కుదరదు. ఇన్నాళ్ళ తర్వాత అతని రాక ఆమెకు ఆశ్చర్యమూ ఆనందమూ కలిగించింది.

యిద్దరూ వొకరినొకరూ వొళ్ళుకళ్లు చేసుకుని ఆపాదమస్తకం చూసుకున్నారు. వరండా వెన్నెట్లో వొకరినొకరు బిగియార కౌగిలించుకున్నారు. కౌగిట్లో ఆమె తన్ను తాను మరిచింది. కానీ అతడు జాగరూకుడుగా వున్నాడు. తన కటిప్రాంతము తప్ప తక్కిన శరీరమంతటితోనూ హత్తుకున్నాడు.

ఆమెకు చివుక్కుమన్నది. అతడి రాకను శంకించింది.

యేమయిపోయావురా అని ఆమె చిరుగడ్డము కన్నీటితో వొణికింది.

అతడు కూడా ఏవో దుక్కపూరితమైన సానునయ వాక్యాలు పలకబోయాడు. కానీ అతడి డేగ చూపులు తలుపు సందులోంచి కనిపిస్తున్న వొక వస్తువును పట్టివేశాయి. అందువల్ల ఆ క్షణం అతడు పలకదలచిన దుక్కపూరిత సానునయవాక్యం ఇలా మారింది.

- ఆ యాష్‌ట్రే యెవరిది?

- నాదే అని ఆమె చెప్పింది.

ఈ సంభాషణ ఫలితమో ఏమో అప్పటికి కౌగిలిలోని వెచ్చదనం చల్లబడింది. విరహంలోని మాధుర్యం మందగించింది. అతడు అపరాధ భావంతో పడకకుర్చీలో కూలబడ్డాడు, యింటికి వచ్చిన అతిథి మాదిరిగా. ఆమె మంచం మీద కూచుంది యింటిలోని యజమాని మాదిరిగా.

అదే మంచం మీద ఒక చిన్నపాప ఆదమరచి నిద్రపోతూ వుంది. ఆమెను చూస్తూ వుంటే అతడికి లోపలి నుంచి పితృవాత్సల్యం పొంగుకొస్తూ వుంది. అతడు లేచి అతి దగ్గరిగా వొచ్చి చూసుకున్నాడు తన పాపను. నెన్నొసటన తగిలీ తగలకుండా ముద్దుపెట్టుకున్నాడు.

అనేక అని ఆమె గుసగుసగా చెప్పింది.

- అనేక.. అర్థం? అని అడిగాడు.

ఆమె నవ్వింది.

- నీలాగే అందంగా వుంది పేరు. కానీ వొక అర్థం వుంటే అన్నాడు.

ఏం మాట్లాడాలో ఆమెకి తోచలేదు.

ఆ రాత్రి అతడు వొక దౌత్య ప్రతినిధిలాగా మాట్లాడాడు. బహుశా వారిద్దరూ.

- నువ్వూ పాపా నాతో వొచ్చేయండి. విప్లవానికి అంకితం అవుదాము అన్నాడు.

ఆమె నవ్వింది.

అతడు సిగరెట్ల కోసం తడుముకున్నాడు.

ఆమె అతడి సిగిరెట్ వెలిగించింది. సిగరెట్ పెట్టిని మధ్యలో చించి యాష్ ట్రేగా చేశాడు. ఆమె యాష్‌ట్రే తెచ్చింది. అతడు దాని వొంక కన్నెత్తి చూడలేదు.

- నువ్వు కాలుస్తావా అని అడిగాడు.

ఆమె నవ్వి

- శంకర్ సురేష్ లక్ష్మణ్ యాసిన్ అంది.

అయితే నేను విన్నది నిజమేనన్నమాట అన్నాడు.

- యేమని విన్నారు అని అడిగింది ఆమె కుతూహలంగా.

అతడు గంభీరంగా పొగవొదుల్తూ తను తయారు చేసుకున్న యాష్‌ట్రేలో నుసి రాలుస్తున్నాడు.

- పోనీ పెళ్ళి చేసుకోవొచ్చుగదా నువ్వు అన్నాడు.


ఆమెకు నవ్వాగలేదు. కళ్ళు చెమ్మగిల్లాయి.

- నిన్ను మళ్ళీ చేసుకోనా అని కొంటెగా చూసింది.

-నేను సీరియస్‌గా అంటున్నా అన్నాడతను.

- సీరియస్ గానేనోయ్. నిన్ను చేసు కుంటాను. సరేనా అని ఆమె అతడి చేతి వేళ్ళలో వేళ్ళు బిగించింది.

- నువ్వు నన్ను మరిచిపోయావు. నా స్థానాన్ని అన్యాక్రాంతం చేశావు. మనం ఇప్పుడు ఒకరికొకరం ఏమీ కాము. మనమార్గాలు వేరు. మన గమ్యాలు వేరు అని అతడు కఠినమైన వాస్తవాన్ని వెల్లడించాడు. చేతిని



మెల్లగా విడిపించుకున్నాడు.

ఆమె బాధగా చూసింది.

అతడు చూపులు తిప్పుకున్నాడు. అది అధైర్యమో అయిష్టమో ఆమెకి తెలీలేదు.

-నువ్విలా వుంటే పాప జీవితం? అని పిరికిగా బాణం వేశాడు.

ఆమె అతనికేసి జాలిగా చూసింది.

ఆ పడక కుర్చీలో అతడు అలాగే నిద్రపోయాడు. తెల్లవారుజామున అతడు ఆమెకు వీడ్కోలు చెప్పి వెళ్ళిపోయాడు. ఆ రాత్రి పడక కుర్చీలో నిద్రపోతున్న అతడి కాళ్ళు నెమ్మదిగా ఎత్తి కుర్చీ మీద వుంచింది. కాళ్ళ క్రింద దిండు పెట్టింది. అతడి శరీరం మీది పాత గ్నాపకాలను ఆమె చూస్తూ వుండిపోయింది.

అతడికి మెలకువ వచ్చేవరకూ ఆమెకు నిద్దరలేదు.

ఆ రాత్రి అతడు నిద్రలో కలవరించాడు. దుఃఖంతో అతడి పెదాలు వొణికాయి. అతడి కనుకొలకుల నుంచి వెచ్చటి కన్నీరు తొణికింది. ఆమెకు అతడు ఒక శిశువులాగా తోచాడు. టీపాయి మీది స్క్రిబ్లింగ్ పాడ్ మీద పెన్సిలుతో గబగబా రాసింది అతడు కలవరించిన మాటల్ని. అవి ఇంగ్లీషు మాటలు.


Wait for me and I will come back
Wait and I will come
Wait thro' autumn's yellow rains
And its tedium
Steal your heart and do not grieve
Wait thro' winters haze
Wait thro' Wind and raging Storm
Wait thro' Summers blaze
Wait when others wait no more
When my letters drop
Wait with hope that never wanes
Wait and don't give up
Wait for me
Staunchly Stubbornly
And like no one else on earth
Waited, love for me

(సర్వకాల సర్వావస్థలలోనూ నా కోసం ఎదురు చూడు ప్రియా నేనొచ్చేదాకా అని)

యీ పదాలతోపాటు ముత్యాల సరం తెగినట్టుగా అతడి కనుకొలకుల నుంచి అశ్రు బిందువులు దొర్లిపోయాయి కలవరింతలోనే. యీ కవితకు ఇదా సందర్భం అని ఆమె చిన్నబోయింది.

శాశ్వత ప్రేమా ఆదర్శ నిరీక్షణా అనే ఆభరణాలు ధరించిన భావ సుందరిని ఊహించడానికి ఆమె వ్యర్థ ప్రయత్నం చేసింది.

ఆ తెల్లవారుజామున అతడు ముభావంగా సెలవు తీసుకున్నాడు.




కన్న కూతురికేసి చూడగలిగే దిటవుతనం అతడికి లేకపోయింది. వుంటే నాతో వుండు లేదా ఇంకొకర్ని పెళ్ళి చేసుకో లేదా నా కోసం వేచిమాడు అని కండిషన్ చేయడానికి వొచ్చాడు ఇన్నాళ్ళ విజ్ఞానం తర్వాత. తన వొస్తువా కాదా అని తెలుసుకోడానికొచ్చాడు.

ఇద్దరికీ ప్రేమ. సరిపోయింది. యెవరి దారి వారిదైంది. సరిపోయింది. మమ్మల్ని రెండో శ్రేణి పౌరులుగా భావించి ప్రేమించినందుకు గాను నిరీక్షణ అనే వడ్డీని మేము ఇంకా చెల్లించవలసి వుందా?

ఆమె తలుపు గడియ వేసి పడక కుర్చీలో మేను వాల్చింది. కుర్చీపైని దిండుపై కాళ్ళు పెట్టి పక్కనే బుక్‌షెల్ఫ్‌లోంచి యూరిబొరేవ్ రాసిన ఈస్తటిక్స్ తీసింది.

నూట పందొమ్మిదో పేజీ దగ్గర ఆగిపోయింది.

కాన్‌స్తాంతిన్ సిమనాఫ్ రష్యా విప్లవ కాలంలో రాసిన కవిత అది.

టీపాయి మీది స్క్రిబ్లింగ్‌పాడ్ మీద తాను పెన్సిల్‌తో రాసిన మాటలను సరి చూసింది. (Extra ordinary) అసాధారణ జ్ఞాపకశక్తి లేదా బాగా ఒంటబట్టినతనం.

ఈ మధ్యనే ఊళ్ళో జరిగిన పంచాయతీ ఒకటి తటాలున గుర్తుకొచ్చింది. పెదరెడ్డి దగ్గర నాలుగు వేలు తీసుకున్నాడు తిరిపాలు. వడ్డీ కింద పెదరెడ్డిగారి యిలాకా బట్టలన్నీ నెలనెలా వుతుకుతూ వుండాలి. రెండున్నరేళ్ళ తర్వాత తిరిపాలుకి బ్యాంకి లోను పదివేలొచ్చింది. నేరుగా రెడ్డిగారి దగ్గరకొచ్చి- అయ్యా ఇదిగో మీరు ఇచ్చిన నాలుగు వేలు అని ఇచ్చేశాడు. మిగతా ఆరు వేల రూపాయిలు చేతిలో పెట్టుకుని - అయ్యా వడ్డీ యెంతో చెప్పండి అన్నాడు.

ఆ మాటతో రెడ్డిగారి దర్బారు కదిలిపోయింది.

-వడ్డీ యెవరు అడిగారురా నిన్ను? అక్కర్లేదు. నెలనెలా బట్టలు వుతికేశావు గదా సరిపోయింది అన్నారంతా.

-అయ్యా వడ్డీ యెంతో చెప్పండి. ఇచ్చేస్తాను. నా రెక్కల కష్టానికి అసలూ వడ్డీ నాకు ఇచ్చేయండి అన్నాడు తిరిపాలు.

-వడ్డీగా డబ్బులు యెవరు అడిగారురా నిన్ను? అక్కర్లేదు. నెలనెలా బట్టలు వుతికేశావు గదా సరిపోయింది పో అన్నారు తోటి కులస్తులు కూడా.

-అయ్యా నాకు బ్యాంకి వాళ్ళు లోను యిచ్చినారు. మీ వడ్డీ కింద డబ్బులు కట్టేస్తాను. కులాచారంగా నేను చేసిన పనికి వెలకట్టి ఇవ్వండి అన్నాడు తిరిపాలు.

-వితండవాదం చేస్తావేమిరా లెక్క సరిపోయింది అని పెద్ద మనుషులంతా చెబుతుంటేః నీకు పెదరెడ్డిగారు ఇవ్వాల్సింది ఏమీ లేదు. కులాచారానికి కూడిక లేమిటి పోరాపో అన్నారు లోకులు.

కులాచారం!

నిరీక్షణ!

కులాచారానికైనా కూడికలున్నాయ్.

పొసగని పొంతనలేని విరుద్ధమైన విషయాలు షార్ట్ సర్క్యూట్ అవడంతో చిన్నగా పోటు మొదలయింది. థర్మామీటర్‌తో రీడింగ్ చూసింది. ఫర్వాలేదు. మైల్డ్ టెంపరేచర్.